క్లుప్తంగా

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి



ఖిల్లాఘనపురం: మండలంలోని దొంతికుంట తండా గ్రామ దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఇండియా కమిటీ అధ్యక్షురాలిగా శాంతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకుడు యాదగిరి తెలిపారు. గ్రామంతో పాటుగా మండలంలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని ఆయన నూతన అధ్యక్షులకు సూచించారు. ఈ సందర్భంగా శాంతి మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను పక్కాగా నిర్వర్తిస్తామన్నారు. తమ గ్రామంతో పాటుగా మండలంలో దివ్యాంగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జనార్దన్, కార్యదర్శి విజయ్, మహిళా కార్యదర్శి అన్నపూర్ణ, రామ్లీ, సుశీలలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

బస్సు పునరుద్ధరించండి

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరి, గోపల్‌దిన్నె గ్రామాలకు గతంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సును వనపర్తి డిపో అధికారులు రద్దు చేయడంతో పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని గ్రామస్తులు తెలిపారు. వెంటనే బస్సును పునరుద్ధరించాలని కోరుతూ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో శనివారం వనపర్తి డిపో అధికారికి ఒక వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పరమేశ్వరాచారి, వెంకటాచారి, రామాచారి, భాను, నవీన్, మాధివాచారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు



ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని సీఐ కార్యాలయంలో సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ సమక్షంలో వారోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ప్రతిరోజు ఆత్మకూర్‌లోని బస్టాండ్, ప్రధాన కూడళ్లు, స్కూళ్లు, తదితర ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఫైర్‌సిబ్బంది సంజీవరెడ్డి, నర్సింహారెడ్డి, వెంకటనర్సింహా, గోపాల్‌రెడ్డి, మోహన్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వనపర్తి టౌన్: పాత బస్టాండ్ సమీపంలో ఆర్య వైశ్య సహాయ నిధి, గట్టు దినేష్ జ్ఞాపకార్థం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఎండ తీవ్రతకు ఇబ్బందులు పడే ప్రజలకు చలివేంద్రం దాహార్తిని తీర్చడంతో పాటుగా వేసవి నుంచి ఉపశమనం కలిగిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సతీష్, గట్టు శశి, చుక్క రాజు, ప్రవీణ్ సాగర్, గోవర్దన్, ఆర్యవైశ్య సంఘం నాయకులు పురుషోత్తం, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జీవితం.. ఆదర్శప్రాయం

వనపర్తి టౌన్: అంబేడ్కర్ జీవితం ఆదర్శప్రాయమని, ఆయన జీవిత చరిత్రను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలనాగయ్య అన్నారు. ఈ మేరకు శనివారం లోక్ అదాలత్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ప్రతి ఒక్కరికీ ఉపయోగపడేలా రాజ్యాంగం రూపొందించారని గుర్తుచేశారు. లోక్ అదాలత్ సంస్థ ఆధ్వర్యంలో అమలవుతున్న పలు కార్యక్రమాలు, మహిళా చట్టాలను న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు కృష్ణయ్య వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాది శ్రీనివాస్‌గౌడ్, పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయురాలు నూర్జహన్, ఉపాధ్యాయులు చెన్నపద్మ, లోక్‌అదాలత్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని డఫోడిల్స్ పాఠశాలలో వార్షికోత్సవం సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. చిన్నతనంలోనే చిన్నారులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై ఆసక్తిని కల్పించడం వల్ల భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించగలుగుతారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బత్తుల రాముడు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మి, కళ్యాణి, రాజేశ్వరి, మాసూం, పార్వతి, మౌనిక, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి పైప్‌లైన్ ధ్వంసం

- చాకల్‌పల్లి సమీపంలో పైపులు ఎత్తుకుపోతున్న ఆగంతకులు
- ప్రైవేట్ పనులకు వినియోగం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



చాకల్‌పల్లి సమీపంలో పైప్‌లైన్ ధ్వంసం చేసి పైపులను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

గోపాల్‌పేట: 15ఏళ్ల క్రితం ఆర్‌డబ్ల్యూఎస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు నాగర్‌కర్నూల్ మీదుగా అచ్చంపేట వరకు తాగు నీరు అందించేందుకు పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. గోపాల్‌పేటలో నిర్మించిన పంప్‌హౌస్ నుంచి కొన్నేళ్ల క్రితం వరకు ఈ పైప్‌లైన్ ద్వారానే ప్రజలకు రామన్‌పాడ్ తాగునీరు అందేది. మిషన్ భగీరథ నీరు వచ్చిన తర్వాత ఈ పైప్‌లైన్ నిరుపయోగంగా మారింది. ఇదే అదనుగా భావించిన కొందరు నాయకులు, కాంట్రాక్టర్లు చాకల్‌పల్లి నుంచి అచ్చంపేట వైపు రోడ్డు వెంట పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి ఇష్టానుసారంగా పైపులను టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా సొంత ప్రయోజనాలకు తీసుకెళ్తున్నారు. కొన్ని రోజులుగా చాకల్‌పల్లి సమీపంలోని పొలాల్లో రైతులు లేని సమయంలో పైప్‌లైన్ తవ్వి పైపులను తరలిస్తున్నారు. కాంట్రాక్టర్లు ఇదే అదనుగా భావించి వారి రోడ్ల నిర్మాణాలకు, రూ. 3వేల ఒక పైపు చొప్పున ఇతర ప్రాంతాల వారికి అమ్ముకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కాంట్రాక్టర్లు పనులు చేస్తే సొంత ఖర్చులతో పైపులు కొని వాడుకోవాలి కానీ తాగునీటి పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి పైపులు వాడుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. గోపాల్‌పేట, ఏదుట్ల, చీర్కపల్లి, చెన్నారం, ఇలా ఉమ్మడి మండలం చుట్టుపక్కల గ్రామాల సమీపంలో ఇప్పటికే వందకుపైగా పైపులు తీసుకువెళ్లినట్లు స్థానికులు చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి



తాగునీటి తరలింపు కోసం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌ను ధ్వంసం చేసి సొంత ప్రయోజనాల కోసం పైపులను వాడుకోవడం సరికాదు. ఈ పైప్‌లైన్ ద్వారా భవిష్యత్‌లో నీరు తరలించే అవసరం రావచ్చు లేదా ఇతర పనులకు అవసరం కావచ్చు. కానీ పైపులను ఇష్టారీతిన కొందరు జేసీబీలతో తీసి అమ్ముకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి పైప్‌లైన్ ధ్వంసం చేసే వారిని అడ్డుకోవాలి

– సంగనమోని వెంకటయ్య, గోపాల్‌పేట

కఠిన చర్యలు తీసుకుంటాం



చాకల్‌పల్లి నుంచి లక్ష్మీదేవిపల్లి, గోపాల్‌పేట నుంచి చాకల్‌పల్లి మధ్యలో పైప్‌లైన్ ధ్వంసం అయినట్లు మా దృష్టికి రాలేదు. చాలారోజుల కింద ఏర్పాటు చేసిన పైప్‌లైన్ అని అంటున్నారు. దానిపై విచారణ జరుపుతాం. మాదృష్టికి వస్తే ప్రభుత్వ పరమైన నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– మొగులయ్య, మిషన్ భగీరథ ఏఈ, గోపాల్‌పేట

భవిష్యత్తులో ఇదే పైప్‌లైన్ దేనికైనా అవసరం కావొచ్చని, ఇలా చేయడం వల్ల ఇబ్బందులు తప్పవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుని పైప్‌లైన్ ధ్వంసం చేసేవారిని అడ్డుకొని, కేసులు నమోదు చేయాలని కోరుతున్నారు.

సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలి



కొత్తకోటలో మాట్లాడుతున్న వామన్‌గౌడ్

కొత్తకోట రూరల్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశానికి కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం పట్టణ కేంద్రంలోని బీపీఆర్ గార్డెన్‌లో నిర్వహిస్తున్న పార్లమెంట్ సన్నాహక సమావేశానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులతో పాటు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి హాజరు కానున్నారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, చెన్నకేశవరెడ్డి, విశ్వేశ్వర్, ఆకుల శ్రీనివాసులు, అలీంఖాన్, ప్రశాంత్, జగన్‌మోహన్‌రెడ్డి, కె.శ్రీను, కృష్ణయ్యగౌడ్, నాగవర్ధన్‌రెడ్డి, సుభాష్ తదితరులు ఉన్నారు.

ఖిల్లాఘనపురం: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య అన్నారు. శనివారం మండలంలోని గట్టుకాడిపల్లిలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బీఆర్‌ఎస్ ప్రచార రథానికి పూజలు నిర్వహించిన ఆయన ప్రచారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో చెన్నయ్య, చిన్న అంజనేయులుగౌడ్, వెంకటేష్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి మెట్ల ఏర్పాట్లు



మెట్ల నిర్మాణం పనులను పరిశీలిస్తున్న చైర్మన్, కాంగ్రెస్ నాయకులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించేందుకు మెట్ల నిర్మాణాన్ని శనివారం రాత్రి మున్సిపల్ అధికారులు చేపట్టారు. రోడ్ల విస్తరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఉన్న చోటు నుంచి పాన్‌గల్ రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసినా.. మెట్ల నిర్మాణాన్ని చేపట్టకుండా వదిలేశారు. దీంతో రెండు, మూడు ఏళ్లుగా అంబేడ్కర్ జయంతి, వర్ధంతి సమయాల్లో నివాళులర్పించేందుకు రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు అంబేడ్కర్‌కు నివాళులర్పించేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గుర్తించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించేందుకు వీలుగా రహదారికి ఇబ్బంది కలగకుండా ఐరన్ మెట్ల నిర్మాణం చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, అధికారులను ఆదేశించారు. దీంతో ఆదివారం అంబేడ్కర్ జయంతి ఉండటంతో శనివారం నిర్మాణపు పనులు చేపట్టారు. ఈ పనులను మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చీర్ల విజయ చందర్, కాంగ్రెస్ నాయకుడు సతీష్ తదితరులు దగ్గరుండి పరిశీలించి నిర్మాణపు పనులను పూర్తి చేయించారు.

'ఉపాధి' కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించండి



కొంకన్‌వానిపల్లిలో కూలీలతో మాట్లాడుతున్నవ్యవసాయ కార్మికసంఘం నాయకులు

అమరచింత: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని కొంకన్‌వానిపల్లిలో శనివారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజువారి కూలి డబ్బులు రాక కూలీల కుటుంబ పోషణ జరగడం ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు తీవ్రం అవుతున్నాయని, పని ప్రదేశంలో టెంట్లతో పాటు తాగునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నందిమళ్ల రాజు, గోవర్ధన్, రాములు, సుజాత, సువర్ణ, పద్మ, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: ఉపాధి పథకంలో పనిచేసే ప్రతి కూలీకి వంద రోజుల పని దినాలు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. ఆయన శనివారం వనపర్తి మండలంలోని పెద్ద గూడెం గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కరువు పరిస్థితులు ఏర్పడిన దృష్ట్యా రైతు పొలాల్లో ఏ మాత్రం పనులు లేని ఈ సందర్భంలో ప్రతి ఉపాధి కూలీ మనిషికి వందరోజుల పని కల్పించాలి కోరారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



వనపర్తి టౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము కోరారు. ఈ మేరకు శనివారం జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. పదేళ్లలో కేంద్రంలో అధికారంలో ఉండి ప్రధానమంత్రి మోదీ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అలివేలమ్మ, నాయకులు చిత్తారి ప్రభాకర్, బాలస్వామి, రాజన్న సాగర్, పవన్ పాల్గొన్నారు.

అత్త, మామపై అల్లుడి ఫిర్యాదు

అమరచింత: భార్యను ఇంటికి తీసుకెళ్లడానికి వెళ్లిన తనపై అత్త, మామలు దాడి చేసి గాయపరిచారని అల్లుడు కుర్వ రవి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మండలంలోని పాంరెడ్డిపల్లికి చెందిన కుర్వ రవి అదే గ్రామానికి చెందిన అమ్మాయిని కొన్నేళ్ల క్రితం పెళ్లి చేసుకున్నాడు. రెండు రోజుల కిందట పుట్టింటికి వెళ్లిన భార్యను ఇంటికి తీసుకెళ్లడానికి అత్తారింటికి శుక్రవారం రాత్రి వెళ్లాడు. తమ ఇంటికి తాగి వచ్చి తమ కూతురితో గొడవ పెట్టుకుంటావా అంటూ అత్త, మామలు కలిసి తనపై దాడి చేశారని బాధితుడు కుర్వ రవి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ



చిన్నంబావి: మండలంలోని పెద్దమారులో గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు రాజ్‌కుమార్, శ్రీనివాసులు, కృపాకర్ తదితర స్నేహితులతో కలిసి తాము చదువుకున్న ప్రభుత్వ పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చదువుకున్న పాఠశాలకు సహకారం అందించడం చాలా సంతోషంగా ఉందని, రానున్న రోజుల్లో పాఠశాలకు ఏవిధమైన సహకారం అందించాలన్న తాము ముందుంటామన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన పూర్వ విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్టాపనోత్సవం



బొడ్రాయికి బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు..



పూజలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: రుక్కన్నపల్లిలో శనివారం బొడ్రాయి (నాభిశిల) ప్రతిష్టా మహోత్సవాన్ని గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నెల 11న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి హోమాలు, యంత్ర, విగ్రహ ప్రతిష్ట చేశారు. ఈ కార్యక్రమాల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్ట కార్యక్రమాన్ని వీక్షించారు. సాయంత్రం బొడ్రాయికి గ్రామంలోని మహిళలు పసుపు, కుంకుమ, పూలు తదితర వాటితో అందంగా తయారు చేసిన బోనంలో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని తీసుకొచ్చి బొడ్రాయికి సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా అన్నదానం చేశారు. పూజల్లో వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎంపీపీ కృష్ణానాయక్ తదితరులు హాజరై పూజలు నిర్వహించారు. బంధువులు, ఆడపడుచులు రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం చోటు చేసుకుంది.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని కేతేపల్లి భగత్ సింగ్‌నగర్ ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించి మధ్యాహ్న భోజనం, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ప్రతి నిత్యం పరిశీలిస్తూ నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందేలా చూడాలన్నారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి



గూడెంలో పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగసానిపల్లిలో ఎస్‌పీఎల్ క్రికెట్ పోటీలను ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీలను స్నేహ పూర్వకంగా ఆడాలని, గెలుపు ఓటములకు సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. మొదటి బహుమతి దాత ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి రూ.25 వేలు, రెండో బహుమతి దాత ఏఐసీసీ స్టేట్ కోఆర్డినేటర్ డాక్టర్ జిల్లెల ఆదిత్యారెడ్డి రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లస్వామి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నాగౌడ్, నాయకులు బీరం రాజశేఖర్‌రెడ్డి, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, కురుమన్న, ఆశన్న, రాజేందర్, గోవిందు, పరశురాం, బీమన్న, శ్రీనివాసులు, శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌సాగర్ తదితరులు పాల్గొన్నారు.



నాగసానిపల్లిలో..

చిన్నంబావి: శ్రీరామ నవమి పండుగ సందర్భంగా మండలంలోని గూడెం గ్రామంలో శనివారం జీపీఎల్ క్రికెట్ పోటీలను నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు చిదంబర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌యాదవ్, ధన్నుయాదవ్ ప్రారంభించారు. గెలుపొందిన జట్లకు మొదటి బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలను అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గూడెం సుధాకర్ నాయుడు, వెంకటేశ్వర్‌రావు, కుమార్, అంజి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'ఇంటి వద్దనే విద్య'తో ప్రయోజనం



ఇంటి వద్దనే విద్యా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న యుగంధర్

వనపర్తి టౌన్: విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాలో ప్రతి శనివారం పాఠశాలలకు రాలేని ప్రత్యేక అవసరాలు ఉన్న విద్యార్థులకు అందిస్తున్న ఇంటి వద్దనే విద్య అనే కార్యక్రమ సేవలను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విలీన విద్యా సమన్వయకర్త యుగంధర్ అన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని బజయ్యనగర్ కాలనీలో ఓ విద్యార్థి ఇంటిని సందర్శించి, ఐఈఆర్పీలు బోధిస్తున్న విధానాన్ని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. అనేక వైకల్యాలు ఉన్న పిల్లలకు భవిత కేంద్రాలలో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, వారానికి ఒకసారి నిర్వహిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ శిక్షణా శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్పీలు ఉమ, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు



ఖిల్లాఘనపురంలో..



ఆత్మకూర్‌లో..

ఆత్మకూర్: పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నేపథ్యంలో సీఐ శివకుమార్, ఎస్‌ఐ నరేందర్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చెరువు కట్ట వద్ద ముమ్మరంగా వాహనాల తనిఖీలు, డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. వాహనాల్లో నగదు తరలింపు, హెల్మెట్లు, ఆర్సీ, లైసెన్సులు పరిశీలించారు. ఎన్నికల నియమావళి, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని వాహనదారులకు సూచించారు. నగదును తీసుకెళ్లాలంటే వాటికి సంబంధించిన పూర్తి ధృవపత్రాలు ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రోషయ్య, హెడ్‌కానిస్టేబుల్ బాలీశ్వర్‌రెడ్డి, జవాన్ ఇమామ్ ఉన్నారు.

ఖిల్లాఘనపురం: వాహనదారులు తప్పనిసరిగా వాహనాలకు నెంబర్ ప్లేటు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు. శనివారం మండలంలో ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానం ఉన్న, నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనాలను పరిశీలించారు. అలాంటి వాహనాలు కలిగిన వారికి అవగాహన కల్పించడంతో పాటుగా జరిమానా విధించారు. కార్యక్రమంలో మండల పోలీస్ సిబ్బంది బొట్టుశ్రీను, లక్ష్మీకాంత్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

అసంపూర్తి డ్రెయినేజీతో అవస్థలు



పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో డ్రెయినేజీల ఇలా..



పాన్‌గల్ ఎమ్మార్సీ కార్యాలయం వద్ద అసంపూర్తి డ్రెయినేజీ ఇలా..

పాన్‌గల్: రోడ్డుపైకి మురుగు నీరు ప్రవహించకుండా ఉండాలన్న ఉద్దేశ్యంతో గ్రామాల్లో నిర్మించిన డ్రెయినేజీలు అధికారుల నిర్లక్ష్యం, పట్టించుకోని ప్రజాప్రతినిధులతో డ్రెయినేజీలు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మండల కేంద్రంలో అసంపూర్తి డ్రెయినేజీలతో మురుగు సక్రమంగా ప్రవహించక పోవడంతో రోడ్లపై పారుతున్నాయి. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో, ఎమ్మార్సీ కార్యాలయం సమీపంలో ఇలాంటి అసంపూర్తి డ్రెయినేజీలతో మురుగు రోడ్లపై పారుతుండడంతో రోడ్లన్నీ బురదమయంగా మారుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రెయినేజీలను పూర్తి చేసి మురుగు రోడ్లపై ప్రవహించకుండా తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బిజినేపల్లి : మండలంలోని వట్టెంలో శనివారం రాఘవరెడ్డి మెమోరియల్ ట్రస్టు, హైదరాబాద్ యశోద ఆస్పత్రి వారిచే సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాదిగా తరలివచ్చారు. ముందుగా కిష్టమ్మ– రాఘవరెడ్డి చిత్రపటాలకు సందడి ప్రతాప్‌రెడ్డి సోదరులు, సందడి దేవేందర్‌రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉదయం 9 గంటల శిబిరం ప్రారంభమైంది. గుండె, ఎముకల, గర్భాశయ, స్త్రీ, పిల్లల, గ్యాస్ట్రిక్ వంటి వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఉచితంగా ఈసీజీ, 2డీకో, ఎముకల పరీక్ష, అబ్డామిన్, బీపీ, మధుమేహం వంటి వివిధ సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలోయశోద ఆస్పత్రి జనరల్ మేనేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్, వైద్యాధికారులు డా. రేణుక, డా. శశిధర్‌రెడ్డి, వైద్య బృందం పాల్గొన్నారు.